క్లుప్తంగా

ఈశ్వరమ్మ మృతదేహానికి డాక్టర్ వెంకయ్య నివాళి


ఈశ్వరమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ వెంకయ్య

కొండపి: మండలంలోని మిట్టపాలెం గ్రామంలో ధర్నాసి ఈశ్వరమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న పీడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య గ్రామానికి చేరుకొని ఆమె భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైస్ సర్పంచ్ మండవ మాలకొండయ్య,గ్రామనాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మకు పొంగళ్లు


అమ్మవారికి నైవేద్యం తీసుకెళ్తున్న భక్తులు

వీసీపల్లి: మండలంలోని లక్కక్కపల్లిలో పోలేరమ్మకు ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా భక్తిశ్రద్ధలతో అమ్మవారికి జలాభిషేకం చేసి పొంగళ్లు పెట్టుకున్నారు. భక్తులు కోరికలు తీర్చాలంటూ మొక్కలు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో తాటిరెడ్డి లక్ష్మీనరసింహారెడ్డి, దొడ్డ నారాయణ రెడ్డి, గణేష్‌రెడ్డి, సిద్దు రెడ్డి, అజయరెడ్డి, ముది రెడ్డి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

సింగరాయకొండ: మండలంలోని పాతసింగరాయకొండ పంచాయతీ పరిధిలో ఆదివారం పేకాట కేంద్రంపై దాడి చేసినట్లు ఎస్సై బి.మహేంద్ర తెలిపారు. దాడిలో ఆరుగురు జూదరులను అదుపులోనికి తీసుకొని వారి వద్ద రూ.2,910 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

వృద్ధులకు చీరలు, దుప్పట్ల పంపిణీ


వృద్ధులకు చీరలు, దుప్పట్లు పంపిణీచేస్తున్న దాతలు

సీఎస్‌పురం(పామూరు): స్థానిక కల్వరి కృపా ప్రార్థనా మందిరంలో చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుదాస్, గూడూరి వినోద్‌కుమార్, పాస్టర్ పడుచూరి ఏసేబు, గూడూరి సదానందం, జి.మధు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ తనిఖీ


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

కనిగిరిరూరల్(హనుమంతునిపాడు): పట్టణంలోని బీసీ బాలుర హాస్టల్‌ను ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉంటున్న వసతి గృహంలోని రూంలు, మరుగుదొడ్లు, తాగునీటి వసతి, వంటశాలను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందిస్తున్నారా లేదా అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి


టంగుటూరు గ్రంథాలయంలో చదవటం మాకిష్టం కార్యక్రమం

టంగుటూరు: పిల్లలు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని గ్రంథాలయ నిర్వాహకుడు జి.వర్ధనరాజు అన్నారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్ధనరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఇలాంటి కార్యక్రమాలు సృజనాత్మకత పెంపొందిస్తాయన్నారు.

రాళ్లపాడు గేట్ల నుంచి నీరు విడుదల

లింగసముద్రం: రాళ్లపాడు ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో 1.1 టీఎంసీలు నీరు చేరింది. నాలుగు రోజుల క్రితం ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో వర్షాలు కురవడంతో 1000 క్యూసెక్కులు పైగా నీరు చేరింది. పూర్తిస్థాయి నీటిమట్టం 21 అడుగులు కాగా ఇన్‌ఫ్లో వస్తుండటంతో శనివారం రాత్రి కొత్త స్పిల్‌వేలోని మూడో నంబర్ గేటును ఎత్తి మన్నేరుకు 750 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఆదివారం ఉదయం 7 గంటలకు గేటును మూసివేసినట్లు డీఈ వెంకటేశ్వర్లు చెప్పారు. ఆదివారం సాయంత్రానికి ప్రాజెక్టులో 20.10 అడుగులు నీటిమట్టం ఉన్నట్లు చెప్పారు.

'బెల్టు' దోపిడీ

ఆరు నెలల్లో అంతా తలకిందులైపోయింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో బెల్టుషాపులపై ఉక్కుపాదం మోపి.. గ్రామాల్లో బెల్టు తీశారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఊరూరా బెల్టుషాపులు వెలిశాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామానికి ఐదు బెల్టుషాపులు సైతం ఏర్పాటు చేస్తున్నారు. 24 గంటలూ మద్యం అందుబాటులో ఉంటుందని గ్రామాల్లో బెల్టుషాపుల నిర్వాహకులు ప్రచారం చేసుకుంటున్నారంటే ఎంత బరితెగించారో అర్థం చేసుకోవచ్చు. క్వార్టర్‌కు రూ.50 అదనంగా పిండేస్తూ మద్యాన్ని ఊరూరా పారిస్తూ పేదలను పీక్కుతింటున్నారు.


సన్నమూరులో ఆటోలో బెల్టు దుకాణాలకు తరలుతున్న మద్యం

- గ్రామాల్లో క్వార్టర్‌కు అదనంగా రూ.50 చొప్పున వసూలు
- 24 గంటలూ అందుబాటులో మద్యం
- ఆరు నెలల్లో అంతా తలకిందులు
- ఒక్కో గ్రామంలో 3 నుంచి 5 బెల్టుషాపులు
- అధికార పార్టీ నేతల కనుసన్నల్లో వ్యాపారం
- లైసెన్స్‌డ్ దుకాణాల నుంచి ఆటోల ద్వారా బెల్టుషాపులకు మద్యం సరఫరా
- ఎక్సైజ్ శాఖాధికారుల ప్రేక్షకపాత్ర

మర్రిపూడి:

ఊరూరా మద్యం ఏరులై పారుతోంది. అధికార పార్టీ నేతల కనుసన్నల్లో గ్రామా గ్రామాల..వీధి వీధిన బెల్టుషాపులు వెలుస్తున్నాయి. లైసెన్సు దుకాణానికి అనుబంధంగా పదుల సంఖ్యలో బెల్టుషాపులు ఏర్పాటు చేసుకొని ప్రజలను దోచేస్తున్నారు. మండలంలో అధికారంగా రెండు లైసెన్సు మద్యం దుకాణాలు ఉన్నాయి. అయితే 21 పంచాయతీల్లో ఈ లైసెన్సు దుకాణాలకు అనుబంధంగా పదుల సంఖ్యలో బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు. ఒక్కో పంచాయతీ పరిధిలో 3 నుంచి 5 దుకాణాలు సైతం నిర్వహిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బెల్టుషాపుల నుంచి ముందుగానే డిపాజిట్లు కట్టించుకుంటున్నారు.

క్వార్టర్‌కు రూ.50 అదనం

గ్రామాల్లో బెల్టుషాపులు అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే ఏర్పాటు చేస్తున్నారు. ఎక్కువ శాతం దుకాణాలు టీడీపీ సానుభూతిపరులే నిర్వహిస్తున్నారు. మండలంలోని కెల్లంపల్లిలో ఇష్టం వచ్చినట్లు బెల్టుషాపులు ఏర్పాటు చేస్తుండటంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేసి బాటిళ్ల దగ్ధం సైతం చేశారు. అయినా ఎక్సైజ్ శాఖాధికారులు అవేమీ పట్టించుకోవడం లేదు. ఒక్క కెల్లంపల్లి పంచాయతీలోనే 5 బెల్టుషాపులు నిర్వహిస్తున్నారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. నిత్యం ఈ గ్రామానికి ఆటోల్లో మద్యాన్ని తీసుకువచ్చి బెల్టుషాపులకు తరలిస్తున్నారు. బహిరంగంగా మద్యాన్ని ఆటోల్లో తరలిస్తున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బెల్టుషాపులపై పొదిలి ఎక్సైజ్ సీఐ, మర్రిపూడి పోలీసులకు సమాచారం ఇచ్చినా ఏమాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఇది ఒక్క కెల్లంపల్లి గ్రామంలోనే కాదు. మండలంలోని అన్ని గ్రామాల్లో బెల్టుషాపులపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా ఎక్సైజ్ శాఖ గానీ, పోలీసు శాఖ గానీ ఏమాత్రం స్పందించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కేవలం అధికారులు అడపా దడపా తనిఖీల పేరుతో హడావుడి చేయడం తప్ప బెల్టుషాపుల జోలికి వెళ్లడం లేదన్న విమర్శలు ఉన్నాయి.


కెల్లంపల్లి గ్రామంలో బెల్ట్ దుకాణాలకు మద్యం వేసేందుకు వెళుతున్న ఆటో

అధికారులకు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు:



మా పంచాయతీలో 6 బెల్ట్ దుకాణాలు 6 ఉన్నాయి. కెల్లంపల్లిలో 4, అగ్రహారంలో 2 బెల్ట్ దుకాణాలు ఉన్నాయి. ప్రతి రోజు ఆటో వచ్చి బెల్ట్ దుకాణాలకు మద్యం వేసి వెళుతున్నారు. ఈ విషయాన్ని అధికారులకు, పోలీసులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదు. పోలీసులు దృష్టి సారిస్తే బెల్టుషాపులన్నీ మూతపడతాయి. కానీ వాళ్లు పట్టించుకోవడం లేదు.

అమరా సుబ్బారావు, కెల్లంపల్లి

బెల్ట్ దుకాణాలను అరికట్టాలి:



మండలంలో బెల్ట్ దుకాణాలు విచ్చలవిడిగా వెలిశాయి. అధికారులు దుకాణాల యజమానుపై చర్యలు తీసుకోవాలి. బాటిల్స్‌పై అధిక రేట్లు అమ్ముడంతో కాయకష్టం చేసుకొనే వారి జేబులకు చిల్లిపడుతుంది. అధికారులు చర్యలు తీసుకోవాలి.

అమరా వెంకటేశ్వర్లు కెల్లంపల్లి



తప్పుడు ప్రచారం తగదు

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌పై తప్పుడు ప్రచారం తగదని పార్టీ వైద్య విభాగం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్ రెడ్డి అన్నారు. స్థానిక పార్టీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనపై పోలీసులు అక్రమంగా కేసు నమోదు చేశారని సింగరాయకొండ మండల కన్వీనర్ సామంతుల రవికుమార్‌రెడ్డి..సురేష్ దృష్టికి తీసుకువచ్చారన్నారు. దీనిపై పోలీసులతో మాట్లాడతానని సురేష్ చెప్పారని, కానీ పత్రికల్లో మాత్రం ఇష్టం వచ్చినట్లు కథనాలు ప్రచురించారన్నారు. అదే రోజు కొండపిలో విద్యుత్ చార్జీల పెంపుపై పోరుబాట ఉండటంతో, ఆ కార్యక్రమం ముగిసిన తరువాత వెళదామని సురేష్ చెప్పారన్నారు. పత్రికలు వాస్తవాలు తెలుసుకొని వార్తలు రాయాలని హితవు పలికారు. పార్టీ నాయకుడు షేక్ పటేల్ మాట్లాడుతూ పార్టీ నిబంధనలు అతిక్రమించిన వారిని ఉపేక్షించేది లేదన్నారు. పత్రికల్లో వచ్చినవి అసత్య కథనాలని పార్టీ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ సుల్తాన్, పార్టి నాయకులు షేక్ కరీం ఖండించారు. పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఢాకా పిచ్చిరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ రాపూరి ప్రభావతి, పాకనాటి సుబ్బారెడ్డి, గాదంశెట్టి గుప్తా, సోమిశెట్టి సురేష్, పీవీరెడ్డి, షేక్ కరిముల్లా, తాండ్ర రామ్మూర్తి, చుక్కా కిరణ్ కుమార్, షేక్ అల్లాఉద్దీన్, కేశవరపు కృష్ణారెడ్డి, షేక్ నౌషాద్, సయ్యద్ ఆబిద్‌ఆలీ, ఆరేటి లక్ష్మీనారాయణ, తన్నీరు వినోద్, చొప్పర వెంకన్న, చొప్పర శివ, శేషయ్య, సాయికోటి, బిల్లా కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వెంకటేశ్వర్లును పరామర్శించిన మాజీ మంత్రి సురేష్

పొన్నలూరు: మండలంలోని వెంకుపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ ముళ్లమూరి వెంకటేశ్వర్లు అనారోగ్యంతో బాధపడుతూ ఒంగోలులోని ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. దీంతో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు డాక్టర్ ఆదిమూలపు సురేష్, డాక్టర్ మాదాసి వెంకయ్య ఆదివారం హాస్పిటల్‌కు వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వెంకటేశ్వర్లుకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని కోరారు.


వెంకటేశ్వర్లును పరామర్శిస్తున్న మాజీ మంత్రి సురేష్, డాక్టర్ వెంకయ్య

ఆర్యవైశ్య మండల అధ్యక్షునిగా శ్రీనివాసరావు

మర్రిపూడి: ఆర్యవైశ్య సంఘం మండల నూతన కార్యవర్గ ఎన్నిక స్థానిక అలవల కళ్యాణ మండలపంలో ఆదివారం నిర్వహించినట్లు సంఘం జిల్లా ఎన్నికల అధికారి మువ్వల శ్రీనివాసరావు తెలిపారు. ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షునిగా నేరెళ్ల శ్రీనివాసరావు, సెక్రటరీగా పాదర్తి శ్రీనివాసరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షునిగా అలవల నరసింహారావు, కోశాధికారిగా కంచర్ల వెంకట నారాయణలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పర్యవేక్షణాధికారిగా ఒగ్గు వెంకటరామయ్య నిర్వహించారు. ఏకగ్రీవమైన సభ్యులకు ఎన్నికల అధికారి మువ్వల శ్రీనివాసరావు చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. కార్యవర్గ సభ్యులుగా జూటూరి నరసింహారావు, మేడ నరసింహారావు, వందవాసి శ్రీనివాసరావు, తాతా సురేష్, నేరెళ్ల కిశోర్, పైడిమర్రి మల్లికార్జునరావు, ఎంవీ గిరి శేఖర్,పువ్వాడ వెంకటేశ్వర్లు, అలవల హరిప్రసాదు, కలవా హనుమంతరావు, ఏ సురేష్ కుమార్, నాగేశ్వరరావు, అచ్చుత ప్రసాదులు ఎన్నికయ్యారు. ముందుగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోని గాంధీ మహాత్ముడు, పొట్టి శ్రీరాముల విగ్రహాలకు పూలమాలలు నివాళులర్పించారు.


నూతన కార్యవర్గ సభ్యులతో ఆర్యవైశ్య సంఘ మండల అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాసరావు

వైభవంగా గోపూజ, మహానివేదన


గోపూజలో పాల్గొన్న ఆలయ కమిటీ, భక్తులు


మహానివేదన ప్రదక్షిణోత్సవంలో పాల్గొన్న ఆలయ కమిటీ, భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో మహానివేదన, గోపూజ ఆదివారం అర్చకులు మంకాల శివప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం నారాయణస్వామి మూలవిగ్రహమూర్తికి, శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తి ఉత్సవ మూర్తులకు అర్చకులు అభిషేకం, ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం భజంత్రీల మేళతాళాలనడుమ ఆలయం చుట్టూ నైవేద్యంతో ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈఓ ఎస్‌జీఆర్. నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు, బి.శివప్రసాద్, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

షిర్డీ సాయిబాబాకు ప్రత్యేక పూజలు


మాజీ మంత్రి కాశిరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

కనిగిరిరూరల్(హనుమంతునిపాడు): పట్టణంలోని షిర్డీ సాయిబాబా దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు దేవకి సుబ్రహ్మణ్యం, పన్నా వెంకటేశ్వర్లు, సభ్యులు ముచ్చర్ల ధర్మారావు, వీసీ రామశాస్త్రి, టంగుటూరి గోవిందరావు, వెంకటేశ్వర్లు, ఓబుల్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల అలసత్వం తగదు

టంగుటూరు: రిజర్వేషన్ వర్గీకరణపై నోటీస్ బోర్డులో వివరాల ప్రదర్శనలో సచివాలయ ఉద్యోగస్తులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని రాష్ట్ర మాలల ఉద్యోగ సంఘం నాయకుడు తులిబిల్లి అశోక్‌బాబు అన్నారు. ఈ మేరకు స్థానిక ఒకటో సచివాలయం వద్ద ఆదివారం మాల సంఘ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ రిజర్వేషన్ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సోషల్ ఆడిట్లో భాగంగా టంగుటూరు మండలం అంబేద్కర్ నగర్ రెండోవ సచివాలయంలో ఎస్సీ ఉప కులాలు సక్రమంగా నమోదయ్యాయో లేదో పరిశీలించారు. అయితే సచివాలయ సిబ్బంది పూర్తిస్థాయి జాబితాను నోటీస్‌బోర్డులో ప్రదర్శించకుండా కేవలం నాలుగు పేజీలు పెట్టడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. తుల్లిబిలి నరసమ్మ మాల సామాజిక వర్గానికి చెందిన మహిళను ఎస్సీ మాదిగగా చూయించారన్నారు. వంద మందికి పైగా అంబేద్కర్‌నగర్‌వాసుల వివరాలు సక్రమంగా చూపించలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు, సిబ్బంది వివరాలు సక్రమంగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి బల్లికురవ గోపినాథ్, జిల్లా కోశాధికారి యత్రమల మల్లికార్జున్, జిల్లా జేఏసీ అధ్యక్షుడు పిల్లి మాల్యాద్రి, అంబేద్కర్‌నగర్ నాయకులు నిరంజన్, దుగ్గిరాల పేరరాజు, చంద్రబాబు, టి.క్రాంతి, ప్రమోద్, కె.రాజు, శ్రీకాంత్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

గృహాలను పరిశీలించిన తహసీల్దార్


రోడ్డు నిర్మాణంలో పోతున్న ఇళ్లను పరిశీలిస్తున్న తహసీల్దార్

హనుమంతునిపాడు: కంభం–కనిగిరి రహదారి డబుల్ రోడ్డు నిర్మాణంలో భాగంగా తొలగిస్తున్న గృహాల వారికి ప్రభుత్వ స్థలం సేకరించి ఇస్తామని తహసీల్దార్ దిలీప్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో రోడ్డు సైడు పోతున్న ఇళ్లను ఆదివారం పరిశీలించారు. వారి పేర్లను అన్ని వివరాలను సేకరించాలని సర్వేయర్ రమణయ్య, వీఆర్‌ఓ చిన్నయ్యకు సూచించారు. స్థానికులు వెంకటసుబ్బయ్య, టి.వీరనారాణయరెడ్డి, వీఆర్‌ఓ జ్యోతి, పంచాయతీ సర్వేయర్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ


జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన కీర్తన

టంగుటూరు: జమ్ము, కాశ్మీర్‌లో ఈనెల 20 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించిన జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో మండలంలోని మర్లపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని జి.కీర్తన పాల్గొని రెండో స్థానం పొందిందని హెచ్‌ఎం నరసరాజు శనివారం తెలిపారు. అనంతపురంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ సబ్‌జూనియర్స్ బాలికల విభాగంలో రాష్ట్ర జట్టుకు ఎంపికైన కీర్తన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంది. ఈ సందర్భంగా శనివారం కీర్తనను పాఠశాలలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. ఉపాధ్యాయులు అచ్యుతరావు, శ్రీనివాసరావు, అంజయ్య, కెజియా, సుందర, కౌసల్య, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు చోరీ

కందుకూరు రూరల్: మండలంలోని ఓగూరు గ్రామం పరిధిలో ఉన్న జగనన్న కాలనీలో విద్యుత్ తీగలు చోరీకి గురయ్యాయి. స్తంభాలపై ఉన్న తీగలన్నింటినీ ఎక్కడికక్కడ కట్ చేసుకొని తీసుకెళ్లారు. కాలనీలో సుమారులు మూడు లైన్లకు ఏర్పాటు చేసి ఉన్న నాలుగు లైన్ల తీగలను కట్ చేసి తీగలను తీసుకెళ్లారు. విలువైన విద్యుత్ తీగలను దొంగలు కట్ చేసి తీసుకెళ్లినప్పటికీ అధికారులు పట్టించుకోలేదు. గ్రామస్తులు గమనించి సమాచారం ఇచ్చారు. దీనిపై విద్యుత్ ఏఈ నరసింహంను వివరణ కోరగా విద్యుత్ తీగలు చోరీకి గురైన విషయం తన దృష్టికి రాలేదన్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

భైరవకోనకు పోటెత్తిన భక్తులు


భైరవకోనలో జలపాతం వద్ద ఉత్సాహంగా సందడి చేస్తున్న భక్తులు, పర్యాటకులు

సీఎస్‌పురం(పామూరు): ప్రముఖ పుణ్యక్షేత్రం, పర్యాటక ప్రాంతం మండలంలోని భైరవకోనకు ఆదివారం భక్తులు, సందర్శకులు పోటెత్తారు. ఇటీవల కురిసిన వర్షాలకు భైరవకోనలో జలపాతం ఉధృతిగా ఉండగా సందర్శించేందుకు వైఎస్సార్ కడప, పొట్టిశ్రీరాములు నెల్లూరు, ప్రకాశం జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో సందర్శకులు తరలివచ్చారు. ఈ సందర్భంగా సందర్శకులు జలపాతంలో స్నానంచేసి త్రిముఖ దుర్గాదేవి, భర్గులేశ్వర, కాలభైరవ, నగరేశ్వర ఆలయాల్లో నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు. దేవస్థాన కమిటీ ఈఓ డి.వంశీకృష్ణారెడ్డి, ముప్పాళ్ల శ్యామ్‌సుందర్‌రాజుల ఆధ్వర్యంలో భక్తులకు, సందర్శకులకు వసతి, అన్నప్రసాదం ఏర్పాటుచేశారు.

మధ్యంతర భృతి వెంటనే చెల్లించాలి

కనిగిరిరూరల్(హనుమంతునిపాడు): ప్రభుత్వం వెంటనే పీఆర్‌సీ కమిషన్‌ను నియమించి 30 శాతం మధ్యంతర భృతిని చెల్లించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సంఘ జోన్ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఏపీటీఎఫ్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఏపీటీఎఫ్ కృషి చేస్తుందన్నారు. సంఘ సభ్యులు హజరత్‌రెడ్డి, టి.శ్రీనివాసులు, పాకాల శ్రీనివాసులు, నజీర్‌బాషా, ప్రసాద్, రవీంద్ర, ఒంగోలు వెంకటేశ్వర్లు, ఆనందబాబు, గోపాలకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున సంఘ అధ్యక్షుడు వాకా జనార్దన్‌రెడ్డి

వసతి గృహాల తనిఖీ


వసతి గృహంలో బాలికలకు సూచనలిస్తున్న మంత్రి స్వామి

సింగరాయకొండ: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర, బీసీ బాలబాలికల కాలేజీ వసతి గృహాలను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి ఆదివారం ఆకస్మిక తనిఖీ చేశారు. మండల కేంద్రంలో ప్రైవేట్ కార్యక్రమానికి ఆదివారం వచ్చిన సందర్భంగా ఆయన వసతి గృహాలను పరిశీలించారు. వసతి గృహాల్లో గదులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జిల్లా అధికారులకు ఫోన్ చేసి వసతి గృహంలో అవసరమైన వసతులు కల్పించాలని సూచించారు. సీఐ సీహెచ్ హజరత్తయ్య, ఎస్సై బి.మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రెండడుగులు పైకి లేచిన కుడి కాలువ గేటు

లింగసముద్రం: రాళ్లపాడు కుడి కాలువ గేటు రెండడుగులు పైకి లేచినట్లు ఇంజినీరింగ్ అధికారులు చెప్పారు. ఆదివారం కుడి కాలువ తూము వద్ద మెగా ఇంజినీరింగ్ కంపెనీ సిబ్బంది హైడ్రాలిక్ జాకీలను ఏర్పాటు చేసి గేటును పైకిలేపే ప్రయత్నం చేయగా రెండడుగులు పైకి లేచింది. అల్పపీడనం ప్రభావంతో వర్షాలు కురవడంతో కుడి, ఎడమ కాలువలకు అధికారులు నీనిని ఆపివేశారు. కుడి కాలువ తూముకు ఉన్న రెండో గేటు ద్వారా నీటిని ఆపివేశారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తూమువద్ద ఇంజినీరింగ్ అధికారులు చేస్తున్న ప్రయత్నాలను పరిశీలించారు. సోమవారం గేటును పూర్తిగా పైకిలేపే ప్రయత్నం చేస్తామని చెప్పారు.